క్లుప్తంగా

రుచి, శుచి తప్పనిసరి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ వాసుదేవరావు

సరుబుజ్జిలి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద నాణ్యత విషయంలో రాజీపడవద్దని డీఎల్‌డీఓ పి.వాసుదేవరావు తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేశారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. సిబ్బంది మూమెంట్ రికార్డులో పొందపరిచిన అంశాలు స్పష్టంగా ఉండాలని సూచించారు. పరిశీలనలో ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు: ఈ నెల 10 నుంచి 12 వరకు కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మండలంలోని పిల్లలవలస గ్రామంలో గల హైస్కూల్ బాలికలు ప్రతిభ కనబరిచారు. శ్రీకాకుళం జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించింది. ఈ జట్టులో పిల్లలవలస విద్యార్థినులు గురుగుబెల్లి ప్రియమణి, వావిలపల్లి దివ్య, పల్ల మాధవి ఉన్నారు. వీరిని హెచ్ఎం కాసులబాబు, పీడీ గురుగుబెల్లి రాజశేఖరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు



కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు

సారవకోట: మండలంలోని గుమ్మపాడులో గల మల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు నిర్వహించారు. మూడు రోజుల నుంచి ఇక్కడ జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించినట్లు పురోహితులు ప్రసాద్ పండా తెలిపారు.

ముగిసిన పైడితల్లి అమ్మవారి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పొందూరు: మండల కేంద్రంలోని పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారంతో ముగిసింది. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లా నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. గ్రామంలో కుటుంబాలన్నీ బంధువులతో కళకళలాడాయి.

రూ.10 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామానికి చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు తమ ఉదారతను చాటుకున్నారు. మండలంలోని నివగాం గ్రామానికి చెందిన జినగ తవిటయ్య అనారోగ్యంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ట్రస్టు సభ్యులు ఆస్పత్రికి వెళ్లి తవిటయ్య భార్య లక్ష్మికి మంగళవారం రూ.10 వేలను అందజేశారు. ట్రస్టు సభ్యుడు నడిమింటి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస: అరుణోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో మహిళలు, యువతీయువకులు స్వయం ఉపాధి పొందేందుకు మూడు నెలల పాటు టైలరింగ్, మగ్గం, అంబ్రాయిడరీ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ జి.అరుణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. శిక్షణ అవసరమైన అభ్యర్థులు ధర్మారావు క్వార్టర్స్‌లో సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. శిక్షణ అనంతరం గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త!



నందికొండ కాలనీ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

- పెరుగుతున్న జ్వర బాధితులు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

సరుబుజ్జిలి: కాలాలు మారుతున్న దశలో అంటు వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశముంది. మారుతున్న వాతావరణ పరిస్థితులకు సర్దుకునేలోగా వ్యాధులు వ్యాపిస్తాయి. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు. ప్రస్తుతం ప్రతీ గ్రామంలోనూ జ్వరబాధితులున్నారు. ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

విజృంభించే వ్యాధులు

కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడంవల్ల డయేరియా వ్యాపిస్తుంది. దీనివల్ల నీరసం, అతిదాహం ఉంటుంది.

చికెన్‌గున్యా..

ఈడిస్ దోమ కుట్టడం వల్ల వ్యాధి చికెన్‌గున్యా వస్తుంది. దోమకుట్టిన తరువాత 3 నుంచి 12 వారాలు లోపు జ్వరం వస్తుంది. తలనొప్పి, వాంతులు,వికారం, హటాత్తుగా జ్వరం రావడం ఈ వ్యాధి లక్షణాలు. శరీరంలో అన్ని కీళ్లపై దీనిప్రభావం ఉంటుంది.

మలేరియా..

ఈ వ్యాధి ప్లాస్మోడియమ్ అనే పరాన్న జీవివల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి ఆడ ఎనాఫిలిస్ దోమకుట్టడం వల్ల వస్తుంది. ఈ దోమలు మంచినీరు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఉండి వ్యాధిని తీవ్రతరం చేస్తాయి. ఈ దోమ కుట్టిన తరువాత 7 నుంచి 10 రోజులుల్లో చలి, వంటి నొప్పిలతోకూడిన జ్వరం వస్తుంది.

డెంగ్యూ జ్వరం..

అన్నింటికంటే ప్రాణాంతకమైన వ్యాధి డెంగ్యూ. టైగర్ అనబడే దోమలు పగటిపూట మాత్రమే కుడతాయి. జ్వరంతోపాటు శరీరంపై ఎర్రటిమచ్చలు, దద్దుర్లు, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం వస్తుంది.

మెదడు వాపు..

చిన్ని పిల్లలో అధికంగా ఈ వ్యాధి వస్తుంది. కళ్లుతిరగడం, రోగి కోమాలోకి వెళ్లడం జరుగుతుంది. పందులకు కుట్టిన దోమలు, మనుషులకు కుట్టడం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది.

ఆమదాలవలస నియోజకవర్గంలో గత 3 నెలలుగా ఆస్పత్రుల్లో (పీహెచ్‌సీల్లో) పెరిగిన ఓపీ వివరాలు

ఆస్పత్రి పేరు	డిశంబర్	జనవరి	ఫిబ్రవరి
జొన్నవలస	678	767	856
సరుబుజ్జిలి	300	378	444
పొందూరు	389	415	564
బూర్జ	313	412	567

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ఆవాసాలు ముందు చెత్త, పెంటకుప్పలు, మురుగునీరు నిల్వలేకుండా చూడాలి.
- కొబ్బరిబొండాల చిప్పలు, పాతటైర్లు, పూల కుండీలు లేకుండా చూడాలి.
- భోజనం ముందు, మలమూత్ర విసర్జన సమయాల్లో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవాలి.
- కలుషిత నీటికి, ఆహార పదార్థాలకు దూరంగా ఉంటూ.. వేడి పదార్థాలను తీసుకోవాలి, కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

రోడ్లపైనే మురుగునీరు..



పారిశుద్ధ్యం విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. మురగు కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేశారు. మురగు నీరు రోడ్లపై నిల్వ చేరి దోమలు, ఈగలు అధికమువుతున్నాయి. అధికారులు స్పందించి నిర్మాణాలు తొలగించాలి.

– ఇల్లాకులు శ్రీనివాసరావు, నందికొండ గ్రామం

తరచూ అంటువ్యాధులు



పారిశుద్ధ్యం లోపం వల్ల తరచూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా జ్వరం వస్తే ప్లేట్‌లెట్ లెవల్స్ తగ్గడంతో ఆందోళనకు గురవుతున్నాం. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

– గదిలి రమణమూర్తి, తురకపేట

జాగ్రత్తలు పాటించాలి



కాలం మారిన వెంటనే సీజనల్ వ్యాధులు ప్రజలను పీడిస్తాయి. ఆరోగ్య సూత్రాలను ప్రజలు కచ్చితంగా పాటించాలి. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి. దోమల మందు పిచికారీ, క్లోరినేషన్ పనులు చేస్తున్నాం. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

– యండ భవ్యశ్రీ, వైద్యాధికారి, సరుబుజ్జిలి

123 మందికి వైద్య పరీక్షలు



రోగి ఇంటికి వెళ్లి వైద్యం అందిస్తున్న వైద్యాధికారి శ్రీలక్ష్మి

కొత్తూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం–2 పరిధిలో మగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో 123 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు పలు రకాల పరీక్షలతో పాటు వైద్య సేవలు అందజేశారు. ఆహార అలవాట్లను వివరించారు. మంచానికే పరిమితమైన పలువురు రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఈఓ బుజ్జిబాబు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

48 మద్యం బాటిళ్ల స్వాధీనం

మెళియాపుట్టి: ప్రైవేట్ బస్సులో తరలిస్తున్న మద్యాన్ని మండల కేంద్రంలో ఎస్ఈబీ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతోనే మెళియాపుట్టి కూడలిలో తనిఖీలు నిర్వహించారు. పర్లాకిమిడి నుంచి పలాస వెళ్తున్న ప్రైవేట్ బస్సులో 48 బీర్ బాటిళ్లతో ఒడిశాకు చెందిన వ్యక్తిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు టెక్కలి సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

అస్కార్‌తో తెలుగు జాతికి దక్కిన ఖ్యాతి

ఆమదాలవలస: ఆర్.ఆర్.ఆర్ సినిమాలో చంద్రబోస్ రచించిన నాటు, నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం తెలుగువారు గర్వించదగ్గ విషయమని ఆమదాలవలసకు చెందిన కవి కె.వి.రాజారావు మాస్టారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మాండలికంలో చక్కని ప్రతీకలతో ఈ పాట రాశారన్నారు. వాడుక పదాలతో శక్తివంతంగా రాసిన ఈ పాటకు ప్రపంచ స్థాయి గౌరవం రావడం అభినందనీయమన్నారు.

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

పాతపట్నం: మండలంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు నాలుగు కేంద్రాల్లో 829 మంది విద్యార్థులు రాయనున్నారని, పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత తెలిపారు. ప్రభుత్వ జూనియర్, బీ.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల, కిరణ్మయి జూనియర్, మహేంద్ర జూనియర్ కళాశాలల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు..

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్, శ్రీవేంకట సాయి జూనియర్ కాలేజీల్లో బుధవారం నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బండారి రవికుమార్ మంగళవారం తెలిపారు. విద్యార్థులు 8.30 గంటలకు తప్పనిసరిగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌తోపాటు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదన్నారు.

డొంకలబడవంజలో సంచార పశువైద్య సేవలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ గ్రామంలో మంగళవారం సంచార పశువైద్య వాహనం ద్వారా పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువులకు వ్యాక్సిన్లు వేశారు. వేసవిలో తాగునీరు అందివ్వటంలోనూ, పాడి దిగుబడి కోసం ఇచ్చే దాణా విషయంలోనూ రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై పశువైద్యులు అవగాహన కల్పించారు. గ్రామ యూత్ అధ్యక్షుడు కాగితాపల్లి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



మెయిన్ రోడ్డులో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: దోమల నివారణకు పట్టణంలో చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి ప్రధాన వీధుల్లోని షాపుల్లో, ఇళ్లల్లో మిలాతిన్ ఆయిల్‌ను స్ప్రే చేస్తున్నట్లు సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. నాలుగు రోజులుగా ఈ స్ప్రే చేస్తున్నామన్నారు. వ్యాపారులు, గృహస్తులు సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న కోలాటం



నరసన్నపేటలోని ఉమామహేశ్వరాలయంలో నవగ్రహ మండపం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన స్థానిక హారికా సునీత కోలాట బృందం నృత్యం ఆకట్టుకుంది. నవగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా పలు పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

- నరసన్నపేట

సకాలంలో విద్యుత్ సమస్యల పరిష్కారం

- సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఛైర్మన్ సత్యనారాయణ

నరసన్నపేట: విద్యుత్ పంపిణీ సంస్థ అందిస్తున్న సేవలకు నిర్ణీత కాల పరిమితిని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి నిర్దేశించిందని, దీని ప్రకారం విద్యుత్ సౌకర్యాలు వినియోగదారులు పొందవచ్చని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) ఛైర్మన్ (విశ్రాంత న్యాయమూర్తి) బి.సత్యనారాయణ అన్నారు. నరసన్నపేటలో మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం వేదికను నిర్వహించారు. ఏడు సమస్యలను స్థానికులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా విద్యుత్ సమస్యలు సకాలంలో సులువుగా పరిష్కారవుతాయన్నారు. వినియోగదారులు ఈ న్యాయస్థానాన్ని వినియోగించుకోవాలన్నారు. సమస్యలను రాతపూర్వకంగా ఇవ్వాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1912కి ఫోన్ చేసి, అనంతరం లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. వచ్చిన ఫిర్యాదులను రెండు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. సమస్య రెండేళ్లలోపుదై ఉండాలన్నారు. 2023లో ఇప్పటివరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 13 సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వీటిలో 10 సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ న్యాయ స్థానం సేవలను మరింతగా వినియోగించుకోవాలని కోరారు. బిల్లులో లోపాలు, విద్యుత్ తీగల మరమ్మతులు, మీటర్లు కాలిపోవడం, విద్యుత్ ఓల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్లలో లోపాలు, కొత్త విద్యుత్ సర్వీసులు వంటి సమస్యలతోపాటు పలు సమస్యలు తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. తొలిత స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిష్కార వేదిక సభ్యులు ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం

- డ్వామా పీడీ జీవి చిట్టిరాజు



వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామాపీడీ చిట్టిరాజు

పాతపట్నం: సమాన పనికి సమాన వేతనం ఉపాధి హామీ పథకం ప్రత్యేకతని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని బద్దుమర్రి గ్రామంలోని చేరువు, బొమ్మిక గ్రామ సమీపంలో ఉన్న రెండు చేరువులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా బయట పనులకు వెళ్లినప్పుడు మగవారికి, ఆడవారికి వేతనాల్లో తేడాలు ఉంటాయని, ఉపాధి పథకంలో అందరికీ సమాన వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. స్థానికంగానే ఉపాధి పొందుతూ గ్రామాల్లోనే సుస్థిర వనరుల ఏర్పాటు చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. వ్యవసాయ ఆయకట్టు స్థిరీకరణ, చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించడం, భూగర్భ జలమట్టం పెంచడం ద్వారా ఆహార ఉత్పత్తులు పెరుగుతాయన్నారు. ఏపీఓ సురేష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వంద రోజుల లక్ష్యంగా ఉపాధి పనులు

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల పని కల్పించాలని ఏపీడీ పంచాది రాధ అన్నారు. మండలంలోని బొత్తాడసింగి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పథకం పనులను మంగళవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం అయ్యారు. మార్చి నెలాఖరు నాటికి ఎక్కువ మంది జాబ్‌కార్డుదారులకు వంద రోజుల పని కల్పించాలన్నారు. ఏపీఓ వి.శ్రీదేవి, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ పర్యటనకు గిరిజన యువత



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్డ్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు

బూర్జ: ఛత్తీస్‌గఢ్ పర్యటనకు మండలంలోని పెద్దపేట ఆర్డ్స్ స్వచ్ఛంద సంస్థ నుంచి 50 మంది ఆదివాసీ యువతను సంస్థ ఆధ్వర్యంలో పంపించడం జరిగిందని డైరెక్టర్ నూక సన్యాసిరావు తెలిపారు. పెద్దపేట నుంచి బయలుదేరిన వాహనాలను మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో నివేదిత ఫౌండేషన్ వారు అమలు చేస్తున్న ఆదివాసీ సుపరిపాలన, సాధికారత, సంప్రదాయాలు, గిరిజన సాంస్కృతి, అటవీ హక్కుల చట్టం, గిరిజనుల జీవన విధానం క్షేత్రస్థాయిలో చూపించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి గిరిజన యువకులను సెలక్ట్ చేశామన్నారు. సంస్థ సీఈఓ బెండి శంకరరావు, మన్యం జిల్లా నుంచి సీతంపేట, కురుపాం, పాచిపేంట, గుమ్మలక్ష్మీపురం మండలాల నుంచి ఆదివాసీ యూత్ లీడర్లు, ఆర్డ్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



పాతపట్నం: అంతరాబ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేయిస్తున్న బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు శ్రీధర్



నరసన్నపేట: బోర్డు ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న అదనపు డీఎంహెచ్ఓ అనురాధ



జలుమూరు: బాలికల ఉన్నత పాఠశాలలో మాత్రలు వేయిస్తున్న జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్



పొందూరు: నులిపురుగుల నివారణ మాత్ర వేసుకుంటున్న విద్యార్థి

నులిపురుగులను నివారిద్దాం

- 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు, అంగన్‌డీ కేంద్రాల్లోని చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను (ఆల్బెండజోల్) మంగళవారం పంపిణీ చేశారు. నులిపురుగులు, కొంకి పురుగుతో రక్త హీనత, పోషకాహార లోపం ఏర్పడి శారీరక, మానసిక ఎదుగుదల ఉండదని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ మాత్రల వల్ల ఏ విధమైన ఇబ్బందులు ఉండవన్నారు. ఎక్కడైనా ఇబ్బంది వస్తే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. రెండేళ్ల నుంచి 19 ఏళ్లలోపు వయస్సున్న వారికి మాత్రలు పంపిణీ చేశారు. పాతపట్నం మండలంలో 17,800 మంది, కొత్తూరు–10,636, మెళియాపుట్టి–4,221, హిరమండలం–5,670, ఆమదాలవలస–10,532, పొందూరు–12,462, సరుబుజ్జిలి–1,998, బూర్జ–5,423, నరసన్నపేట–18,250, పోలాకి–12,726, సారవకోట–7218, జలుమూరు–4,783 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: నులిపురుగల నివారణ మాత్రలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ కాళీప్రసాద్



కొత్తూరు: ఎంపీపీ పాఠశాల-1లో మాత్రలు పంపిణీ చేస్తున్న కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీలక్ష్మి



బూర్జ: ప్రాథమిక పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న బూర్జ పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రాజశేఖర్



సారవకోట: నవతేజ పాఠశాలలో నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఎంఈఓ రమణ



సరుబుజ్జిలి: కొండవలస ప్రాథమికొన్నత పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం ఎం.శ్రీకాంత్



హిరమండలం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ



మెళియాపుట్టి: చాపర పాఠశాలలో మాత్రలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ పడాల చంద్రకుమారి



ఆమదాలవలస రూరల్: పొన్నాంపేట ఎంపీపీ పాఠశాలలో నులిపురుగుల నివారణ గురించి వివరిస్తున్న ఎంపీడీఓ రేణుక